క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు



నరసరావుపేట రూరల్: మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్ఐ కిషోర్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అలాగే రూరల్ పరిధిలోని లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. రిజిష్టర్లను పరిశీలించారు. వ్యక్తుల పూర్తి సమాచారం తీసుకున్న తరువాతే వారికి గదులు కేటాయించాలని సిబ్బందికి సూచించారు. అనుమానిత వ్యక్తులు గురించి పోలీసులకు తెలియజేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జేఎన్‌టీయూఎన్‌లో వర్క్‌షాప్



నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నాన్ డిస్ట్రిక్ టెస్టింగ్‌పై సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. విశాఖపట్నం భారత్ ఇన్‌స్టిట్యూట్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ ప్రతినిధులు సి.హెచ్. సతీష్‌కుమార్, ఎం.బాలకృష్ణలు రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొని క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాపును కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఐఎస్ ఫణిసుష్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరుగు పందెం పోటీలు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖ గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు సోమవారం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. షాదీదా, డి. నాగబాబు, బి. రమేష్‌లు నిర్వహించారు. శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీతత్వం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారులు కె. వెంకట్రావు, జి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలూరిపేట: పురపాలక సంఘ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక వనరుల అందుబాటును బట్టి దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అందుబాటులో ఉన్న నిధులతో ప్రతి వార్డులో రూ. 5 లక్షలకు మించని పనులను కౌన్సిలర్లు ప్రతిపాదిస్తే సదరు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్, టీపీఎస్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా ఉప విద్యా శాఖ అధికారి వేణుగోపాలరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల్లోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. బడికి హాజరు కాని, హాజరు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్‌లు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తుర్లపాటి వెంకట సుబ్రమణ్యేశ్వర రావు, ఉపాధ్యాయులు పి.కోటేశ్వరమ్మ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కాలనీకు చెందిన చెరుకూరి రోశయ్య (70) ఆదివారం రాత్రి 2.30 గంటలకు బస్టాండ్ నుంచి బయటకు వచ్చి జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

పచ్చదనం కరువై.. ఆహ్లాదం కనుమరుగై

- చిలకలూరిపేటలో అభివృద్ధికి నోచుకోని పార్కులు
- పిల్లల ఆట వస్తువులు ధ్వంసం
- ఆనవాళ్లు కోల్పోతున్న ఉద్యానవనాలు
- పట్టించుకోని పాలకులు



ఆనవాళ్లు లేని రజకకాలనీ పార్కు



ధ్వంసమైన పెట్‌హౌస్

చిలకలూరిపేట: పార్కులు మాత్రం అభివృద్ధికి నోచుకోవటంలేదు. పట్టణంలోని పార్కుల్లో పచ్చదనం కరువైంది. ఆనందం, ఆహ్లాదం పంచాల్సిన పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. రోజురోజుకూ కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్న పట్టణంలో కాసేపు పచ్చని చెట్ల కింద సేదతీరే అవకాశం లేకుండా క్షీణదశకు చేరుతున్నాయి. దశాబ్దాల నాడు ఏర్పాటైన కళామందిర్ సెంటర్‌లోని గాంధీ పార్కు, రజక కాలనీలోని రాజీవ్‌గాంధీ పార్కు, సాంబశివనగర్, పురుషోత్తమపట్నంలలో మరో రెండు పార్కులు ఎలాంటి ఆలనపాలన లేక పార్కులు కునారిల్లుతున్నాయి. పంచాయతీగా ఉన్న చిలకలూరిపేట 1964వ సంవత్సరంలో పురపాలక సంఘంగా అవతరించింది. నాటికే ఉన్న గాంధీపార్కులో అనంతర కాలంలో మంచినీళ్ల ఓవర్‌హెడ్ ట్యాంక్ కట్టడంతో నాల్గోవంతు స్థలం ట్యాంక్ కిందకు వెళ్లిపోయింది.

పూర్వం ఎప్పుడూ పిల్లల ఆటపాటలతో అలరాలుతుండే ఈ పార్కు కాలక్రమంలో ప్రాధాన్యత కోల్పోయింది. టీవీలు అంతగా అందుబాటులో లేని రోజుల్లో ఎంతోమంది పార్కుకు వచ్చి రేడియో ద్వారా వార్తలు వినటం, వార్తాపత్రికలు చదవటంతో పాటు పచ్చని వాతావరణంలో సేదతీరుతుండేవారు. రానురాను పార్కు చుట్టూ గదులు నిర్మించి అద్దెకు ఇవ్వటంతో పార్కు కాస్త కుదించుకుపోయింది. ఉన్న చెట్లు తగ్గిపోయి కాలక్రమంలో పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య తగ్గిపోయింది. పార్కులో ఉన్న వాటర్ ఫౌంటేన్ ఎంతో కాలంగా పనిచేయటం లేదు. ఫిష్ అక్వేరియం ధ్వంసమై వెనుక మొండి గోడలు మాత్రమే మిగిలాయి. లవ్‌బర్డ్స్ తదితర పక్షులతో కిలకిలరావాలు పలుకుతుండే పెట్‌హౌస్ ధ్వంసమై పక్షులు అంతరించిపోయాయి. సందర్శకుల రాక తగ్గిపోవడంతో వారి స్థానంలో యాచకులు, సాధువులు చేరి గంజాయి పీల్చే అడ్డాగా మారిపోయింది. పిల్లలు ఆడుకొనే జారుడుబల్ల తదితర సామాగ్రి తుప్పుపట్టి పనికిరాకుండా పోయింది. రజక కాలనీలో 1999వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ మున్సిపల్ పార్కు పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. గతంలో ఇక్కడ పార్కు ఉన్న విషయం స్థానికులు చెబితే తప్ప తెలియని పరిస్థితి. ప్రహరీకి ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్‌ను సైతం దుండగులు ఎత్తుకుపోవడంతో ఖాళీ ప్రదేశం మాత్రమే మిగిలింది. పురుషోత్తమపట్నంలో ఉన్న పార్కులోకి వెళ్లేందుకు ఎవరూ సాహసించని పరిస్థితి. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన సాంబశివనగర్‌లో ఉన్న పార్కులో ఇప్పటికీ ఒక్క మొక్క నాటిన పాపాన పోయిన దాఖలాలు లేవు. తూర్పు మాలపల్లెలో ఉన్న చంద్రమౌళి పార్కులో మచ్చుకు మొక్క కనిపించదు. ఈ పార్కుల తర్వాత ఏర్పడిన ఎన్టీఆర్ కాలనీలోని పార్కు, కృష్ణానగర్ పార్కు, సీఆర్ కాలనీ పార్కు మాత్రమే ప్రస్తుతానికి ఉపయోగకరంగా ఉన్నాయి. దీంతో అత్యధిక పార్కులు నిరుపయోగంగా మారిన నేపథ్యంలో పట్టణంలోని పార్కులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేస్తాం



పట్టణంలోని గాంధీ పార్కును 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి చేస్తాం. మిగిలిన పార్కులను నిధుల అందుబాటు బట్టి దశలవారీగా అభివృద్ధి చేస్తాం. ప్రణాళిక బద్ధంగా ఒక్కో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.
–పి శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

ఎంపీడీవో సీతారామయ్య



శావల్యాపురం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం నిధుల ద్వారా గ్రామాభివృద్ధికి దోహదపడతాయని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం మండలంలోని కనమర్లపూడి, శావల్యాపురం గ్రామ పంచాయతీలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల ఆమోద గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో గ్రామపంచాయతీల్లో నిర్వహించే ఉపాధి పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలన్నారు. ఉపాధి నిధులు దుర్వినియోగం కాకుండా ఉండటానికి ముందుస్తుగా గ్రామాల్లో గుర్తించిన పనులకు ఆయా గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ తీర్మానంతో పాటు పరిపాలన అమోదం పొందడానికి ఈగ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. కనమర్లపూడిలో 61 పనులకు గాను రూ.64 లక్షల నిధులు, శావల్యాపురం గ్రామపంచాయతీలో 85 పనులకు రూ. 61 లక్షల నిధులను అమోదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు తన్నీరు భారతి, యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ, ఏపీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు బోడ్డు యాకోబు, బాల పరమేశ్వరరావు, టీఏ రోజారాణి, ఫీల్డ్ అసిస్టెంట్స్ చెరుకూరి బాలకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులతో బాధ్యతగా వ్యవహరిద్దాం

ఎస్పీ కంచి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులను ఆరోగ్యవంతమైన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించటంలో కళాశాలలు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థుల నడవడిక, ఆలోచనలు, ఆసక్తి తదితర అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సమాజ శ్రేయస్సుకు దోహదపడేలా తీర్చిదిద్దాలని కోరారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపల్స్‌తో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు (డ్రగ్స్), ర్యాగింగ్, ఆత్మహత్యలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సులో ఆయా అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కళాశాలల యాజమాన్యాలకు తగిన సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, ఆత్మహత్య ధోరణుల సంకేతాలను గుర్తించటంపై అధ్యాపకులు దృష్టి సారించాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలను ఎప్పటికప్పుడు విద్యార్థులతో చర్చిస్తూ మానసిక పరివర్తన తీసుకురావాలని తెలిపారు. ఇటీవల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తున్న అంశమని తెలిపారు. ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులు క్షణికావేశాలతో జీవితాన్ని కోల్పోవటం పట్ల విచారం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు, కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది, సామాజిక వేత్తలు, ప్రజలు సమిష్టిగా కృషి చేస్తూ నేరాలను అరికట్టడంతో పాటు యువతను అభివృద్ధి బాటలో నడపాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జె.వి.సంతోష్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి, డీఎస్పీలు కె.నాగేశ్వరరావు (నరసరావుపేట), ఎం.హనుమంతరావు (సత్తెనపల్లి) తదితరులు పాల్గొన్నారు.

రైతుకు శాపంగా మారిన అధికారుల నిర్లక్ష్యం



తహసీల్దారుకు ఫిర్యాదు చేసిన రైతు గాలి వెంకటేశ్వర్లు

శావల్యాపురం: రెవెన్యూ అధికారులు అవినీతి నిర్లక్షం వలన అర్హత కల్గియున్న సాగు భూములు ఉన్న రైతులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి కె.వి.ఆర్.మోహన్ చందు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిచికలపాలెం గ్రామానికి చెందిన గాలి వెంకటేశ్వర్లుకు చెందిన సాగు భూమి విస్తీర్ణం తగ్గించారని తహసీల్దారు కె.సుజాతకు లిఖితపూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2016లో గ్రామానికి చెందిన తుర్లపాటి సీతయ్యకు చెందిన భూమిని అదే గ్రామానికి గాలి వెంకటేశ్వర్లు సర్వే నంబరు 324లో ఉన్న ఎకరం 45 సెంట్లు సాగు భూమి కొనుగోలు చేసి రిజిష్టరు చేయించి పట్టాదారు పాసుపుస్తకం ప్రభుత్వ నిబంధనలు సాగులో ఉన్నాడు. అదే విధంగా సదరు రైతు కొనుగోలు చేసిన సాగు భూమి సమగ్ర వివరాలన్నీ అప్పట్లో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. 2020లో ఇదే భూమిని తుర్లపాటి సీతయ్య రెవెన్యూ అధికారుల ప్రమేయంతో లంచం ఇచ్చి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృషించి చేబ్రోలు శిరీషాకు అమ్మేరు.సదరు రైతు గాలి వెంకటేశ్వర్లుకు చెందిన సాగు భూమి ఎకరం 45 సెంట్లు ఉండాల్సి ఉండగా ఆన్‌లైన్ భూ విస్తీర్ణం తగ్గించి 0.98 సెంట్లు భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు భాదిత రైతు గాలి వెంకటేశ్వర్లు వాపోయారు. మిగిలిన భూమిని శిరీషా పేరుపై వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. రెవెన్యూ అధికారులు సత్వరమే విచారణ చేసి సంబంధిత రైతుకు న్యాయం చేయాలని కె.వి.ఆర్. మోహన్‌చందు కోరారు.

క్యాన్సర్ సర్వే పారదర్శకంగా చేయాలి



మాట్లాడుతున్న హనుమాకుమార్

శావల్యాపురం: గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ఎన్‌సీడీ 3.0 సర్వే పారదర్శకంగా చేయాలని జిల్లా ఫ్యామిలీ వైద్యాధికారి ప్రోగ్రాం నోడల్ అధికారి హనుమా కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 ఎన్‌సీడీ సర్వే ప్రారంభమైందని, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. ఈ సర్వేలో బీపీ, షుగర్, థైరాయిడ్, తదితర వ్యాధులతో పాటు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కల్గియున వారిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించటం ద్వారా క్యాన్సర్ వ్యాధి నివారణ చేయటానికి దోహదపడుతుందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయు సమయంలో ఏమైనా సందేహాలు ఉంటే సత్వరమే నివృత్తి దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరు నెలల పాటు సర్వే జరుగుతుందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజరు అలవపలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

నరసరావుపేట: పట్టణంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, మార్పుల కోసం రెండు ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం పేర్కొన్నారు. ప్రకాష్‌నగర్–2, రంగాస్ట్రీట్–2 సచివాలయంలో ప్రత్యేక క్యాంపులు ఈనెల 19వ తేదీ నుంచి 22వరకు, 26 నుంచి 29వరకు నిర్వహించబడతాయన్నారు. అడ్రస్సు, జిల్లాల మార్పులు, ఆధార్ సేవలను ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి వినియోగించుకోవాలని పట్టణ ప్రజలను కోరారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌లో రక్తదానం



నరసరావుపేట: జిల్లా మొట్టమొదటి కలెక్టర్‌గా పనిచేసిన ఎల్.శివశంకర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ప్రభుత్వ వైద్యశాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌లో ఆయన అభిమానులు ఐదుగురు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ శివశంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని బ్లడ్ సెంటర్‌కు ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక స్థలం కేటాయించారన్నారు. ఇప్పుడు దీనివలన ఎంతో మందికి అత్యవసర స్థితిలో రక్తం అందించే అవకాశం కలిగిందన్నారు. డిస్టిక్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వర్లు, దాసు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం సీపీఐ నాయకుల ధర్నా



వినుకొండ మున్సిపల్ కార్యాలయంవద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



నరసరావుపేటలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయా సచివాలయాలలో ఇళ్ల స్థలాల అర్జీలను సిబ్బందికి అందచేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణరాజు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య, షేక్.జాన్‌సైదా, మండల కార్యదర్శి బొడ్డు అంజిరెడ్డి, ఫాతిమా, హుస్సేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: అర్హులైన పేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేసి, ఇళ్లు నిర్మాణం చేసి ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల మంజూరు కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేయించి ఇస్తామని నాడు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. భవన నిర్మాణ వ్యయం తీవ్రంగా పెరిగిపోయిన ప్రస్తుత తరుణంలో ఇసుక, సిమెంటు, ఇనుము, ఇటుకలు వంటి భవన నిర్మాణ సామాగ్రిని ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. మాటల్లో కాకుండా ఉచిత ఇసుక విధానాన్ని చేతల్లో అమలు చేయాలని కోరారు. పేదల ఇళ్ల కల నెరవేర్చే వరకు సీపీఐ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చౌటుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ అన్నారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పట్టణంలోని మున్సిపాలిటీలో నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. టిడ్కో గృహాలను కూడా లబ్ధిదారులకు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలల గడుస్తున్నా ఇళ్ల స్థలాల ఊసే ఎత్తలేదన్నారు. ఇప్పటికైనా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణంలోని 5వ వార్డు సచివాలయం వద్ద కూడా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, కార్యదర్శి ఉలవలపూడి రాము, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ పాఠశాలలో సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మాక్సివిజన్ ఐ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చెంచురెడ్డి పర్యవేక్షణలో వైద్య సిబ్బంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఐడ్రాప్స్ అందించారు. ఈసందర్భంగా డాక్టర్ చెంచురెడ్డి కంటి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కపలవాయి రాజేంద్రప్రసాదు, కార్యదర్శి సాతులూరి శివకుమార్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మేళ్లచెరువు సుమిత్రకుమార్, పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ షేక్.జిలానీమాలిక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రోటరీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మాక్సివిజన్ సహకారంతో వారం రోజుల పాటు పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆటల పోటీలు



ఆటల పోటీలను పారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్

నరసరావుపేట రూరల్: ఆటలు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ తెలిపారు. 77వ ఎన్‌సీసీ డే సందర్భంగా కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో క్యాడెట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ సంబంధిత కార్యక్రమాల్లో హడావిడిగా ఉండే క్యాడెట్స్‌కు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వారిలో ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు.

గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించడం ఈ ఆటల పోటీల ద్వారా క్యాడె ట్స్ నేర్చుకోవచ్చని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, మ్యాజికల్ చైర్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్, ఏవో శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ ఎల్.కృష్ణారెడ్డి, వ్యాయామ అధ్యాపకులు ఆంజనేయులు, విజయ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక సోమవారం



ప్రత్యేక అలంకరణలో శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి (విప్పర్ల)

రొంపిచర్ల: మండల ప్రజలు కార్తిక సోమవారం పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారు జాము నుంచే పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాలు భక్తులతో నిండాయి. భక్తులు ఉపవాసాలు పాటించారు. దేవతా మూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా దేవాలయాల ప్రధాన అర్చకులు కార్తిక సోమవారం ఉపవాసాల వల్ల కలిగే ప్రయోజనాలను, చేకూరే పుణ్యాలను వివరించారు. వడ్లమూడివారిపాలెం శ్రీ గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, రొంపిచర్ల శ్రీ శంకరస్వామి, బుచ్చిబాపన్నపాలెం శ్రీ వీరభద్రస్వామి, విప్పర్ల శ్రీ గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి, కొత్తపల్లి శ్రీ హరిహర తదితర దేవాలయాలు భక్తులతో నిండాయి.

వివరాలు యాప్‌లో నమోదు చేయండి

శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదల సమగ్ర వివరాలన్నీ ఇన్కమ్ యాప్ సర్వేలో నమోదు చేయాలని ఏపీయం జి.వాసుబాబు అన్నారు. సోమవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని యానిమేటర్ల, మహిళా సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీయం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉన్ననటువంటి మహిళా సభ్యులకు సంబంధించి బ్యాంకు రుణాలు, కుటుంబ సభ్యుల ఆదాయం, బ్యాంకు వివరాలు, ఉపాధి పథకం జాబ్‌కార్డు, రుణాలు వివరాలన్నీ తప్పులు లేకుండా పొరపాట్లు జరగకుండా వీవోఏలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయనతో పాటు సీసీలు ఖాజావలీ, మేరి కుమారి, ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ మేనేజర్

నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11.30 నుంచి 12.30 వరకు డయల్‌యువర్ ఆర్టీసీ మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జీవీఎస్ఎస్ కుమార్ సోమవారం పేర్కొన్నారు. పట్టణ, పరిసర గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని 99592 25428 నంబరుకు కాల్‌చేసి సమస్య తెలియచేయాలని కోరారు.